

చిత్తూరులో చిన్నారి కృష్ణులు..



బంగారుపాళ్యంలోని రాజావీధిలో శ్రీకృష్ణుడి విగ్రహానికి భక్తుల పూజలు





చౌడేపల్లెలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు





కృష్ణుడు, రాధ వేషధారులను తీసుకెళుతున్న కుటుంబీకులు

కృష్ణా.. ముకుందా

జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామితో పాటు పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు అలరించారు. కొన్ని చోట్ల ఉట్లు కొట్టారు. శ్రీకృష్ణ చిత్రపటాలు, విగ్రహాలను ఊరేగించారు. సెలవు రోజైనా పలు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలతో జన్మాష్టమి కార్యక్రమాన్ని నిర్వహించారు.

- చిత్తూరు కల్చరల్

వైద్యం వికటించి ఇంటర్ విద్యార్థిని మృతి!

- కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ.. ఆగ్రహం
- పలమనేరులో క్లినిక్ అద్దాలు పగలగొట్టిన యువకులు



అంబులెన్సు వద్ద గుమిగూడిన జనం



మృతిచెందిన తేజశ్రీ

పలమనేరు, ఆగస్టు 26: 'జ్వరంతో వెళితే వైద్యం చేశారు. ఇంటికెళ్లగానే తీవ్ర అస్వస్థతకు గురైంది. పెద్ద ఆస్పత్రులకు తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. తొలుత చేసిన వైద్యం వికటించడం వల్లే ఇంటర్ విద్యార్థిని తేజశ్రీ (16) మృతి చెందింది' అంటూ ఆమె కుటుంబీకులు, బంధువులు, స్థానికులు ఆగ్రహించారు. పలమనేరులోని శ్రీనివాసా క్లినిక్ అద్దాలను సోమవారం పగలగొట్టారు. బాధితులు తెలిపిన ప్రకారం.. పలమనేరు సమీపం నాగమంగళం వద్ద పారిశ్రామిక వాడకు చెందిన జయచంద్ర కుమార్తె తేజశ్రీ స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతోంది. జ్వరంతో బాధపడుతున్న ఈమెను గురువారం పలమనేరు టీకే స్ట్రీట్‌లో పోలీసు స్టేషన్‌కు ఎదురుగా 'సోగ్రాఫాతిమా బీయుఎంఎస్, రాణాప్రతాప్ బి.ఫార్మ్' అనే వారు



అంబులెన్సులో మృతదేహం

నడుపుతున్న శ్రీనివాస క్లినిక్‌కు తీసుకొచ్చారు. ఆమెకు ఇంజక్షన్ వేసి మాత్రలు ఇచ్చి పంపించారు. ఇంటికి వెళ్లిన వెంటనే తేజశ్రీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో చిత్తూరు సమీపంలోని సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి తిరుపతి లోని స్విమ్స్‌కు తీసుకెళ్లినా ఆమె కోలుకోలేదు. అటుపిమ్మట రాణిపేటలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తేజశ్రీ తుది శ్వాస విడిచింది. ఆమె కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు తేజశ్రీ మృతదేహాన్ని సాయంత్రం అంబులెన్సులో తీసుకొచ్చి శ్రీనివాస క్లినిక్ ముందు ఉంచి నిరసన తెలిపారు. ఆ తర్వాత కోపోద్రిక్తులైన కొందరు యువకులు క్లినిక్ ముందున్న అద్దాలను పగులగొట్టి షట్టర్‌ను మూసేశారు. పోలీసు స్టేషను ముందే వందలాది మంది గుమికూడి ఉండటంతో పోలీసులు, మహిళా ఎస్ఐ ఆందోళనకారుల వద్దకు వచ్చారు. సంఘటనపై ఫిర్యాదు ఇస్తే తాము తగిన చర్యలు తీసుకొంటామని వారికి నచ్చచెప్పారు. దీంతో వారు ఆందోళన విరమించి వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసులను విచారించగా సంఘటనపై తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు రాలేదని తెలిపారు.



క్లినిక్‌ను ధ్వంసం చేస్తున్న యువకులు

ప్రభుత్వ వసతిగృహాలలో సీట్లు భర్తీ కావడం లేదు. హాస్టళ్లలో విద్యార్థులను చేర్పించడానికి వార్డెన్లు, సంక్షేమాధికారులు చొరవ చూపడం లేదు. సాంఘిక సంక్షేమ శాఖ (ఎస్సీ) పరిధిలోని వసతి గృహాలకు సంబంధించి జిల్లాలో 56 శాతం విద్యార్థులు మాత్రమే చేరారు. పాఠశాలలు పునఃప్రారంభమై మూడు నెలలు అవుతున్నా ఇంతవరకు వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరగలేదు. వసతిగృహాల్లో ప్రభుత్వం పెట్టే మెనూను ఎస్సీ విద్యార్థులకు వివరించి వారిని వసతిగృహాల్లో చేర్పించడంలో వార్డెన్లు విఫలమయ్యారు. పట్టించుకోవాల్సిన ఆ శాఖ ఉన్నతాధికారులు చూసీచూడనట్లు ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- చిత్తూరు

ఖాళీ వసతి 'గృహాలు'



- అడ్మిషన్లు పట్టని ఎస్సీ హాస్టళ్లు
- బడులు తెరిచి నెలలవుతున్నా కన్నెత్తి చూడని సంక్షేమాధికారులు
- జిల్లాలో 56 శాతం దాటని విద్యార్థుల సంఖ్య

జిల్లావ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 57 వసతిగృహాలు ఉన్నాయి. వీటిలో ప్రీమెట్రిక్ కింద 41, పోస్టుమెట్రిక్ కింద 16 వసతిగృహాలు నడుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో హాస్టల్‌లో వందమంది విద్యార్థులకు ఆశ్రయం కల్పించాలి. ఆ దిశగా సంక్షేమశాఖ అధికారులు, వార్డెన్లు చర్యలు చేపట్టాలి. ఈ లెక్కన 57 వసతిగృహాలలో 5700 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉండాలి. కానీ, వాస్తవానికి ఉండేది 3200 మంది విద్యార్థులు మాత్రమే. అంటే సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని వసతిగృహాల్లో 56.1 శాతం విద్యార్థులు మాత్రమే ఉన్నారు. కుప్పం, పుంగనూరు, కార్వేటినగరం, నగరి పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో 20మందికిలోపే విద్యార్థులు ఉన్నారు. అలాగే మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు చదువుకుంటున్న పెనుమూరు, గంగాధరనెల్లూరు ప్రీమెట్రిక్ హాస్టళ్లలో కూడా 20 మందికి లోపు విద్యార్థులు ఉన్నారు.

రిజర్వుడు నియోజకవర్గాల్లోనూ దారుణంగా..

- పూతలపట్టు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు రిజర్వుడు స్థానాలు. వీటిలో పూతలపట్టు నియోజకవర్గంలో యాదమరి, బంగారుపాళ్యం, తవణంపల్లె, పూతలపట్టు, పి.కొత్తకోటతో కలిపి మొత్తం తొమ్మిది వసతిగృహాలు ఉన్నాయి. ఒక్కో వసతి గృహంలో వందమంది చొప్పున 900 మంది విద్యార్థులు ఉండాలి. కానీ, నియోజకవర్గం మొత్తంలో 450 మంది అంటే.. 50శాతానికి మించలేదు.
- అలాగే గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో జీడీనెల్లూరు, ఉగ్రాణంపల్లె, పెనుమూరు, కొత్తపల్లెమిట్ట, వెదురుకుప్పం, పచ్చికాపలం, దేవళంపేట, కార్వేటినగరం తదితర ప్రాంతాల్లో 13 వసతిగృహాల్లో 1300 మంది విద్యార్థులు ఉండాల్సివుండగా 500 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఈ లెక్కన 35 శాతం కూడా దాటలేదు.

శ్రద్ధ చూపని అధికారులు

ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉన్నప్పుడు జిల్లా స్థాయి అధికారులు వసతిగృహాల తనిఖీలకు, ఇతర పనులకోసం వెళ్లడానికి కొంత ఇబ్బంది ఉండేది. జిల్లాల పునర్విభజనతో ఇప్పుడు ఏడు నియోజకవర్గాలే ఉన్నాయి. దీంతో వసతి గృహాల తనిఖీలు, సందర్శించే అవకాశం, సమయం ఉంది. అయితే జిల్లా అధికారులు కనీస శ్రద్ధ పెట్టకపోవడంతో రిజర్వు నియోజకవర్గంలో కూడా ఆశించిన స్థాయిలో విద్యార్థులు చేరడం లేదు.

వార్డెన్ల వైఫల్యం

జిల్లావ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూవోలు గ్రామాలలో తిరిగి విద్యార్థులను వసతి గృహాల్లో చేర్పించడానికి చర్యలు చేపట్టాలి. వసతి గృహంలో ప్రభుత్వం పెట్టే మెనూతో పాటు దుస్తులు, నోటుపుస్తకాలు, కాస్మెటిక్ ఛార్జీల గురించి వివరించి విద్యార్థుల తల్లిదండ్రులు ఒప్పించి చేర్పించాల్సి ఉంది. అయితే వార్డెన్లు గ్రామాల్లోకి వెళ్లిన దాఖలాలు లేవు. ఎవరైనా వసతి గృహాన్ని వెతుక్కుంటూ వచ్చిన వారిని మాత్రమే వార్డెన్లు చేర్చుకున్నారు తప్ప క్షేత్రస్థాయిలోకి ఒక్క విద్యార్థిని కూడా చేర్పించలేదనడానికి జిల్లాలో ఉన్న విద్యార్థుల సంఖ్యే నిదర్శనం.

16 వసతి గృహాలకు ఇన్‌చార్జులే

జిల్లాలో 57 వసతి గృహాలుండగా వాటిలో 16 వసతి గృహాలకు ఇన్‌చార్జి వార్డెన్లే విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌ఛార్జీలుగా ఉన్న వారంతా ఆ శాఖ ఉన్నతాధికారికి విధేయులే. ఉన్నతాధికారితో ఉన్న చనువుకొద్దీ వసతిగృహాన్ని సక్రమంగా చూడటం లేదన్న విమర్శలున్నాయి. ఇన్‌ఛార్జీగా ఉన్న వసతిగృహాన్ని పట్టించుకోవడంలేదు. అక్కడంటే ఇక్కడ... ఇక్కడంటే అక్కడ ఉంటున్నామని ఏమార్చుకుంటూ ఇళ్లవద్దనే ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వార్డెన్లందరూ మండల కేంద్రంలోనే ఉండాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ చాలామంది లేరు. నివాసం ఉండటం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి బంగారుపాళ్యం వసతిగృహంలోకి వర్షపునీరు వెళితే ఆ సమయంలో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో గ్రామస్థులే విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు.

నేడు వార్డెన్లతో సమావేశం

జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై మంగళవారం ఉదయం 10గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్యక్షతన కలెక్టరేట్‌లో వార్డెన్లతో సమావేశం జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగులశాఖ వసతి గృహాల వార్డెన్లతో మౌలిక వసతులు, మెనూ, నిర్వహణపై సమీక్షించనున్నారు. ఇది వరకే కలెక్టర్ విద్యార్థుల అడ్మిషన్లు, అవసరమైన పనులపై నివేదిక తెప్పించుకున్నారు. కలెక్టరుగా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారి అన్ని సంక్షేమ శాఖల వార్డెన్లతో సుమిత్‌కుమార్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.

వివిధ శాఖల్లో అర్హులకు రేపటి నుంచి ఇంటర్వ్యూలు

చిత్తూరు, ఆగస్టు 26: మహిళాభివృద్ధి, జిల్లా స్త్రీ-శిశు సంక్షేమ శాఖలో ఖాళీ పోస్టులకు నిర్వహించిన కంప్యూటర్ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ పీడీ నాగశైలజ ఒక ప్రకటనలో తెలిపారు. 28వ తేదీ ఉదయం 9 గంటలకు పోషణ్ అభియాన్ పథకం కింద డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు అసిస్టెంట్, బ్లాక్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. 29వ తేదీ మిషన్ వాత్సల్య పథకం కింద ప్రొటెక్షన్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషియల్ వర్కర్, అకౌంటెంట్, డేటా అనలిస్ట్, అవుట్‌రీచ్ వర్కర్ పోస్టులకు, 30వ తేదీ మిషన్ శక్తి పథకం కింద ఐటీ స్టాఫ్, ఆఫీస్ అసిస్టెంట్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్, పారాలీగల్ పర్సనల్, పారా మెడికల్ పర్సనల్, ఫిజియో సోషియల్ కౌన్సిలర్, మల్టీపర్పస్ అసిస్టెంట్, సెక్యూరిటీ గార్డు, నైట్‌వాచ్ ఉమెన్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. ఇప్పటికే అర్హుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరవ్వాలని కోరారు.

వీఆర్‌కు బంగారుపాళ్యం సీఐ

బంగారుపాళ్యం, ఆగస్టు 26: బంగారుపాళ్యం అర్బన్ సీఐ లక్ష్మయ్యను ప్రభుత్వం వీఆర్‌కు పంపింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆయన కర్నూలు నుంచి బంగారుపాళ్యంకు బదిలీపై వచ్చారు. వారం రోజుల క్రితం కేజీ సత్రం వద్ద ఆటో, కారు ఢీకొన్న సంఘటనలో వీకోటకు చెందిన ఎస్టీలు గాయపడ్డారు. వారినే బెదిరించి సీఐ కేసు కట్టారని ఆరోపణలు వచ్చాయి. దీంతో బాధితుల పక్షాల కొంత మంది ఎస్పీ, డీజీపీ, గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. వాటి పర్యవసానమే సీఐని ప్రభుత్వం వీఆర్‌కు పంపిందని సమాచారం.

క్రీడాకారులు లేరట!

తొలిరోజే నామమాత్రంగా క్రీడాదినోత్సవం

క్రీడాకారులతో 'ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ'

..ఇదీ క్రీడాదినోత్సవంలో తొలిరోజు షెడ్యూల్. చిత్తూరు నగరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థలోని డీఎస్ఏ మైదానంలో క్రీడాకారులతో ఈ ప్రతిజ్ఞ చేయించాలి. సోమవారం ప్రారంభమైన క్రీడా దినోత్సవం 30వ తేది వరకు జరగనుంది. ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

అధికారులు చేసిందేమిటి?: మూడు ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి చేతులు దులుపుకొన్నారు.

ఎందుకిలా..: జిల్లా ప్రాధికార సంస్థలో కోచ్‌ల సంఖ్య తక్కువ కావడం, ప్రస్తుతం ఆయా క్రీడల్లో క్యాంపులు లేకపోవడంతో మైదానానికి వచ్చే క్రీడాకారులు తక్కువయ్యారట. అందుకని తొలిరోజు ప్రతిజ్ఞ చేయించేందుకు క్రీడాకారులు లేకపోవడం.. పాఠశాలలకు సెలవు కావడంతో హాస్టళ్లను ఎంచుకున్నట్లు డీఎస్ఏ అధికారులు చెబుతున్నారు. ఆయా హాస్టళ్ల వద్దకు ఒక బ్యానరుతో వెళ్లి ప్రతిజ్ఞ చేసి తొలిరోజు కార్యక్రమాన్ని నామమాత్రంగా ముగించారు.

ఏ రోజు ఏ కార్యక్రమం: సోమవారం నుంచి 30వ తేది వరకు జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల చేత ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ. డీఎస్ఏ స్టేడియంలో చిత్తూరు నగరంలోని 9, 10వ తరగతి విద్యార్థులకు క్రీడాపోటీల నిర్వహణ. 28న సాయంత్రం 4.30 గంటల నుంచి డీఎస్ఏ మైదానంలో 18-60 ఏళ్ల వారికి క్రీడాపోటీల నిర్వహణ. 29న హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అతిథుల చేత పూలమాల వేసి నివాళులర్పించాలి. 30న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రముఖ క్రీడాకారులకు సన్మానం.



చిత్తూరులోని ఏపీ ట్రైబల్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్ఏ అధికారులు

అధికారులు ఏమంటున్నారంటే..: 'ఐదు రోజుల కార్యక్రమాల నిర్వహణకు రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ రూ.15 వేలు మాత్రమే కేటాయించింది. ఈ నిధులతోనే క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికెట్లు, ర్యాలీలు, బ్యానర్లు, ఇతర కార్యక్రమాలు చేయాలి. అందుకు తగ్గట్టుగానే నిర్వహణ ఉంటుంది' అని ఆఫ్ ది రికార్డుగా డీఎస్ఏ అధికారులు అంటున్నారు.

- చిత్తూరు క్రీడలు

రెవెన్యూ శాఖలో బదిలీలకు కసరత్తు

నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ గడువు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 26: రెవెన్యూ శాఖలో బదిలీలకు కసరత్తు జరుగుతోంది. జిల్లా పునర్విభజన తర్వాత ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జరుగుతున్న తొలి బదిలీలివి. ఈ క్రమంలో పలువురు ఉద్యోగులు చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు వెళ్ళేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల నుంచి సిఫార్సు లేఖలతో వస్తున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలోని 15 మండలాలు, తిరుపతి జిల్లాలోని 20 మండలాలు, చిత్తూరు జిల్లాలోని 31 మండలాల పరిధిలోని రెవెన్యూ ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. బదిలీలకు దరఖాస్తుల స్వీకరణకు గడువు మంగళవారంతో ముగియనుంది. ఇప్పటివరకు 220కి పైగా దరఖాస్తులు కలెక్టరేట్‌కు అందాయి. వీరిలో వీఆర్వోల సంఖ్య 90కి మించి ఉన్నాయి. నెలాఖరు వరకు బదిలీలకు గడువు ఉంది. పదవీవిరమణకు దగ్గరగా ఉన్న వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు వచ్చేవారికంటే చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు వెళ్ళేందుకు ఎక్కువమంది మొగ్గు చూపుతూ సిఫార్సు లేఖలు తీసుకొని వస్తున్నారు. రెండురోజుల సెలవు అనంతరం మంగళవారం ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది.





బాలకృష్ణం భజే

వాడవాడలా వైభవంగా కృష్ణాష్టమి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 26 : శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తిరుపతిలోని అష్టసఖీ సమేత రాధాగోవింద కమల మందిరం(ఇస్కాన్)లో జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆలయంలో వేకువ జామున నాలుగు గంటల నుండి మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జరిగాయి. ఉదయం ఎనిమిది గంటల నుండి రాత్రి 11.45 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం జరిగింది. యువత ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. రాత్రి 11 గంటలకు రాధాగోవిందులకు మహాశంఖాభిషేకం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే అన్ని క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనం కోసం భక్తులకు రెండు గంటల సమయం పట్టింది. ఇస్కాన్ ఆలయానికి వచ్చే అన్ని దారులు మూసివేసి ఆలయానికి వచ్చేవారిని మాత్రమే అనుమతించారు. తుడా మైదానంలో యాదవ సంఘాలు ఏర్పాటు చేసిన మధుర ఆలయం నమూనా సందర్శకులను ఆకట్టుకుంది.సాయంత్రం 6.30 గంటల నుంచి నృత్యం, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



ఇస్కాన్ గుడి పక్కనున్న మైదానంలో ఉట్లోత్సవం

తిరుపతి తుడా మైదానంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఆకట్టుకున్న గోవర్ధనగిరిధారి, మధుర ఆలయ నమూనా





ఇస్కాన్ ఆలయానికి పోటెత్తిన జనం

ప్రకృతి వ్యవసాయంపై శ్రీలంక రైతుల అధ్యయనం



శీగలపల్లెలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శ్రీలంక రైతులు

కుప్పం, ఆగస్టు 26: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేయడానికి శ్రీలంక రైతులు సోమవారం కుప్పం మండలంలో పర్యటించారు. శీగలపల్లె గ్రామాన్ని సందర్శించి, రైతు జి.కృష్ణమూర్తి పొలంలో చేస్తున్న సమీకృత వ్యవసాయ పద్ధతులను పరిశీలించారు. ఏటీఎం, ఏ గ్రేడ్ పద్ధతులలో కూరగాయల సాగు, వేరుశనగ యూనివర్సల్ మోడల్, ఎస్‌పీఎం షాప్ పద్ధతులను గురించి వారికి కృష్ణమూర్తి వివరించారు. సేంద్రియ ఎరువుల తయారీ, వాటిని పంటలకు వాడే విధానాల గురించి కూడా చెప్పారు. స్వయంసహాయక సంఘాల సభ్యులను కలిసిన శ్రీలంక రైతులు, ప్రకృతి వ్యవసాయం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. చిత్తూరు జిల్లాలో సాగుతున్న ప్రకృతి వ్యవసాయం పద్ధతులను అధ్యయనం చేసిన అక్కడి రైతులు, ఇది అద్భుతమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఆరోగ్యంతో పాటు భూసారం కూడా పెరుగుతుందని తెలుసుకుని తాము కూడా ఈ వ్యవసాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, సీనియర్ లీడ్ చంద్రశేఖర్, ఎస్పీఎం శ్రీనివాసులు, డాక్టర్ పుష్ప, యశ్వంత్, రాజేశ్, గురుప్రసాద్, నాంచారమ్మ, కల్పన, మండలంలోని క్యాడర్ మెంటార్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మదగజం అఘాయిత్యంతోనే ఆడ ఏనుగు మృతి



ఎర్రావారిపాలెం, ఆగస్టు 26 : వెంట తీసుకొచ్చిన మదగజం దాడి వల్లే ఆడ ఏనుగు మృతి చెందిందని పోస్టుమార్టం నివేదికతో వెల్లడైంది.ఎర్రావారిపాలెం మండలం పులిబోనుపల్లె సమీపంలోని ఉరం గుట్ట వద్ద నాలుగురోజుల క్రితం మృతి చెందిన ఏనుగుకు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన ఏనుగు చెవుల నుంచి రక్తస్రావం జరిగినట్లు కనపడడంతో ఆంత్రాక్స్ వ్యాధి కావచ్చేమో అని తొలుత అనుమానించారు.నిర్ధారణ కోసం ఆ రక్తాన్ని తిరుపతిలోని ల్యాబ్‌కు పంపి పరీక్షించారు. ఫలితం నెగటివ్ రావడంతో ఆంత్రాక్స్ వ్యాధితో మరణించలేదని తేలింది.సీసీఎఫ్‌వో నాగేశ్వర రావు, డీఎఫ్‌వో సతీష్ , ఎస్వీ జూపార్క్ క్యూరేటర్ సెల్వన్, వైల్డ్ లైఫ్ డాక్టర్ తోయిబా సింగ్, ఎఫ్ఆర్వో దత్తాత్రేయ , సర్పంచ్ దేవేంద్ర తదితరుల సమక్షంలో జరిగిన పోస్టుమార్టంలో పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. మృతి చెందిన ఏనుగుకు 16 సంవత్సరాలుంటాయి.9 నెలల గర్భంతో వుంది.అయితే ఏనుగు పిండం చెదిరిపోయి వుంది.తలభాగం, తొండం , దంతాల వద్ద బలమైన గాయాలున్నాయి. శరీరంపై రెండు చోట్ల లోతుగా పోట్లు ఉన్నాయి. కడుపులో బలమైన గాయాలుండడం , శరీరంలో రక్తం గడ్డ కట్టి ఉండడం గమనించారు. ఏనుగు మరణించిన స్థలానికి దగ్గర్లో రెండు ఏనుగుల మధ్య పోట్లాట జరిగిన ఆనవాళ్లున్నాయి.చెట్లు,కొమ్మలు విరిగిపోయి ఉండడం ,భూమిపై ఏనుగులు భీకరంగా తలపడినట్లు ఉండడంతో ఆడ ఏనుగుపై మదపుటేనుగు అఘాయిత్యానికి పాల్పడినట్లు ఎలిఫెంట్ రీసెర్చ్ సైంటిస్టు రాకేష్ కల్వ నిర్ధారించారు. దీంతో తొలుత ప్రచారం జరిగినట్లు ఏనుగు కరెంట్ తీగలు తగిలి మరణించిందనే విషయం నిజం కాదని తేలిపోయింది. విద్యుత్ లైన్ కూడా సంఘటనా స్థలానికి చాలా దూరంలో ఉండడం గమనార్హం.

శేషాచలంలో రెండు మందలుగా గజరాజులు

శేషాచల అడవుల్లో రెండు మందలుగా ఏనుగులు సంచరిస్తున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. 9 ఏనుగులతో కూడిన గుంపు కళ్యాణి డ్యాం కేంద్రంగా తిరుమల,మామండూరు,రంగంపేట అడవుల్లో జీవిస్తున్నాయి.మరో 20 ఏనుగుల గుంపు తలకోన ,సానిపాయి , తలకోన పేటు అడవుల్లో సంచరిస్తున్నాయి. సాధారణంగా మదపుటేనుగులను మిగతా ఏనుగులు మందకు దూరంగా ఉంచుతాయి . గుంపు యజమానిగా ఆడ ఏనుగులే వ్యవహరిస్తుంటాయి. గర్భంతో వున్న ఏనుగు మదపుటేనుగుతో మాత్రమే కలిసివచ్చింది.మధ్యలో దాంతో కలిసేందుకు మదపుటేనుగు ప్రయత్నించడంలో భాగంగా రెండింటి మధ్య పోరాటం జరిగింది. కోపంతో మదపుటేనుగు దాడి చేసిన క్రమంలోనే ఆడ ఏనుగు మృత్యువాత పడినట్లు అధికారులు నిర్ధారించారు.

భూముల విలువ సవరణకు కసరత్తు!

ఇష్టారాజ్యంగా పెంచేసిన వైసీపీ ప్రభుత్వం ● ప్రజలపై అమిత భారం ● దిద్దుబాటు దిశగా కూటమి చర్యలు

ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వం భూములకు సంబంధించి మార్కెట్ విలువను అమాంతం పెంచేసింది. అల్పాదాయ, మధ్య తరగతి ప్రజలపై కోలుకోలేని విధంగా భారం మోపింది. ఫలితంగా జిల్లాలో స్థిరాస్తి వ్యాపారం నేలచూపులు చూశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా భూవిక్రయాలు మందగించాయి. దాంతో జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా పడిపోయింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో స్థిరాస్తి విలువలను 2022లో ప్రభుత్వం అమాంతం రూ.30 కోట్లు పెంచి, ప్రజలపై పెనుభారం వేసింది. గత తప్పులను గుర్తించిన కూటమి ప్రభుత్వం భూములు, స్థలాలను అన్ని వర్గాలకు ఆమోదకరమైన రీతిలో మార్కెట్ విలువను సవరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో భూములు, స్థలాల విలువలు సవరించేందుకు రిజిస్ట్రేషన్‌శాఖ కసరత్తు ప్రారంభించింది. సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, స్థానిక సంస్థల అధికారులు, ఎంపిక చేసిన మరి కొన్నిశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో మార్కెట్ విలువలు పరిశీలిస్తున్నారు. తమ శాఖలకు సంబంధించిన వివరాలను వీరంతా సేకరిస్తున్నారు. ఈ నెలాఖరులోగా అన్ని శాఖలు వివరాల సేకరణ పూర్తిచేయనున్నాయి. అవకాశమున్న ప్రాంతాల్లో భూవిలువలు పెంచేలా ప్రతికూల పరిస్థితులున్న చోట్ల తగ్గించేలా రిజిస్ట్రేషన్‌శాఖ చర్యలు తీసుకోనుంది. వివరాల సేకరణ ముగియగానే. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా మార్కెట్ విలువ రివిజన్ కమిటీ సమావేశం సెప్టెంబరు తొలివారంలో జరగనుంది. ఆ సమావేశంలో సవరణలు చేపడతారు. తిరిగి ఆన్‌లైన్ ద్వారా ప్రజల ముందుంచి సవరణలపై ఆక్షేపణలు, సలహాలు, సూచనలు, అభ్యంతరాలు తీసుకుంటారు. వాటిని సెప్టెంబరు 15లోగా కమిటీ పునఃపరిశీలించి విలువలు ఖరారుచేస్తారు. ప్రభుత్వ ఆమోదం పొందిన పిదప వచ్చేనెల 16 నుంచి కొత్త ధరలు అమల్లోకి తీసుకొస్తారు.

భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఆదాయం గత నాలుగు నెలల్లో భారీగా తగ్గింది. లక్ష్యంలో 56శాతమే సాధించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై వరకు వసూళ్ల లక్ష్యం రూ.74.33 కోట్లు కాగా, ఇందులో రూ.41.18 కోట్లు మాత్రమే వృద్ధి సాధించింది. దీంతో వృద్ధిరేటు భారీగా పడిపోయింది. గత నాలుగు నెలల్లో 18వేల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే గత నాలుగు నెలల కాలానికి 50 శాతం మాత్రమే వృద్ధి సాధిస్తే, ఈ ఏడాది 56శాతం మాత్రమే జరిగింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ల్యాండ్ టైటిలింగ్ చట్టం, భూసర్వే తదితర కారణాలతో వసూళ్ల లక్ష్యం తగ్గింది. వీటితో పాటు ఎన్నికల సమయంలో పెద్ద మొత్తాల నగదుతో ప్రయాణం ఇబ్బందిగా మారడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కక్షిదారులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వేచిచూసే ధోరణి అవలంబించడం కూడా కారణాలుగా మారింది.



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

\- చిత్తూరు కలెక్టరేట్

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 26: తిరుపతిలో గంజాయిని దాచి విక్రయిస్తున్న ఇద్దరిని అలిపిరి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారినుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వచ్చే 100 రోజుల్లో తిరుపతి జిల్లాను డ్రగ్ రహితంగా మార్చాలనే సంకల్పంతో గంజాయి, మాదక ద్రవ్యాల సేవనం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటివి అరికట్టడానికి ఎస్పీ సుబ్బరాయుడు ఓ టాస్క్‌ఫోర్సు బృందాన్ని ఏర్పాటు చేశారు.ఈ నేపథ్యంలో అలిపిరి సీఐ రాంకిషోర్ సిబ్బందితో కలసి కపిలతీర్థం రోడ్డు ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద స్థితిలో కన్పించిన ఇద్దరు వ్యక్తులను పట్టుకుని విచారించగా వారి వద్ద గంజాయి బయటపడింది. చిత్తూరు జిల్లా సదుం మండలం యర్రాతివారిపల్లెకు చెందిన పట్టాభి గుణశేఖర్, ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోని మన్నసముద్రం గ్రామానికి చెందిన కొండా మునిభరణిగా వారిని గుర్తించారు. గుణశేఖర్ బ్యాగులో 12కిలోల గంజాయి, మునిభరణి బ్యాగులో 10కిలోల గంజాయి స్వాధీనంచేసుకున్నారు. యశోదనగర్‌లోని గుణశేఖర్ రూములో గంజాయిని నిల్వచేసి చిన్న చిన్న పొట్లాలు కట్టి అవసరమైనవారు ఫోన్ ద్వారా సంప్రదిస్తే తీసుకెళ్ళి విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని డీఎస్పీ వెంకటనారాయణ చెప్పారు. మునిభరణిపై గతంలో కూడా మూడు గంజాయి కేసులున్నట్లు చెప్పారు. గంజాయి ముఠాను అరెస్టు చేసిన డీఎస్పీతోపాటు సీఐ రాంకిషోర్, సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతిలోఎక్కడైనా మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నా.. వినియోగిస్తున్నా.. గోడౌన్లలో స్టాకు పెట్టినట్లు తెలిసినా పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హెల్మెట్ ఏదీ గోవిందా..!



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు

తిరుమల ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనదాల భద్రత నిమిత్తం టీటీడీ గత కొన్నేళ్లుగా హెల్మెట్ తప్పనిసరి నిబంధనను అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమలకు వచ్చే, వెళ్లే ఉద్యోగులు, భక్తులు, వ్యాపారులు, స్థానికులు హెల్మెట్ నిబంధనను కేవలం తనిఖీలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. అలిపిరి చెక్‌పాయింట్‌లో హెల్మెట్ ఉందని భద్రతా సిబ్బందికి చూపించి దాటిన తర్వాత దానిని బైక్‌లపై మోసుకుపోతున్నారే తప్ప ధరించడం లేదు. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన భక్తులు కూడా హెల్మెట్‌ను ధరించకుండా ప్రయాణించిన నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయినప్పటికీ భద్రతా సిబ్బంది కోసం అన్నట్టుగా కేవలం అలిపిరి చెక్‌పాయింట్, తిరుమలలో జీఎన్సీ టోల్‌గేట్‌ల వద్ద మాత్రమే ధరించి ఆ తర్వాత హెల్మెట్ తీసేస్తున్నారు. ఈక్రమంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించడంతోపాటు తప్పనిసరిగా ధరించేలా మార్గమధ్యంలో తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

ద్రావిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీకి పురస్కారం



గుడుపల్లె, ఆగస్టు 26: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొర స్వామి నాగభూషణం పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన పాతూరి ఫౌండేషన్ సమావేశంలో అధ్యక్షులు కేసీ కల్కురా చేతుల మీదుగా ఆయన సత్కారం పొంది, నాగభూషణం పురస్కారాన్ని స్వీకరించారు.

ఆశాజ్యోతి ద్వారా దివ్యాంగులకు సంక్షేమ పథకాలు


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

పలమనేరు, ఆగస్టు26 : పలమనేరు నియోజక వర్గలోని దివ్యాంగులకు ఇకపై ఆశాజ్యోతి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందజేస్తామని సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం నియోజక వర్గంలోని దివ్యాంగులు సమావేశమై సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు సుబ్బమ్మ ప్రభుత్వం దివ్యాంగులకు అంద జేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఇప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారందరికి అందించేందుకు తగిన చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సమావేశంలో ఆశాజ్యోతి దివ్యాంగుల సంఘం కార్యదర్శి రమేష్, కోశాధికారి హరిక్రిష్ణ, శివరాం, అధ్యక్షులు శంకర్, కార్యదర్శి గురివిరెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, ఉపకార్యదర్శి ప్రమీల, కమిటి సభ్యులు, ఐదు మండలాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శివశంకర్

రామకుప్పం, ఆగస్టు 26: సెప్టెంబరు 1 నుంచి ప్రారంభమయ్యే బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుల సీనాథ్ కోరారు. సోమవారం రామకుప్పంలో వారు పార్టీ మండల ముఖ్యనేతల సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు పార్టీ సభ్యత్వం స్వీకరించేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజసింహ, వెంకటేశ్, ఆంజినేయప్ప, జనార్ధన్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ


సీసీటీవీ ఫుటేజీలో ద్విచక్రవాహనాన్ని అపహరిస్తున్న గుర్తుతెలియని వ్యక్తి దృశ్యం

కల్లూరు, ఆగస్టు 26: కల్లూరులో ఆదివారం పట్టపగలు ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. తన దుకాణం ముందు ద్విచక్ర వాహనం పార్కింగ్ చేసిన 5 నిమిషాల్లోనే గుర్తుతెలియని దుండగుడు చాక చక్యంగా అపహరించాడు. పట్టణం లోని దాసరిగూడెంకు చెందిన వెంకట రమణ పుంగనూరు రోడ్డులో నిత్యావసర సరుకుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన ఇంటి నుంచి ద్విచక్రవాహనంలో దుకాణం వద్దకు చేరుకొని దుకాణం ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి దుకాణంలోకి వెళ్లాడు. ఐదు నిమిషాల అనం తరం వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనాన్ని అపహరిస్తున్న దృశ్యాలు కనిపించాయి. వెంటనే కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో కావడి పండుగ




దవడలకు శూలాలు గుచ్చుకుని వస్తున్న భక్తులు, (ఇన్‌సెట్లో) మొక్కులు తీర్చుకునేందుకు వీపుతేరు లాక్కొని వస్తున్న భక్తుడు

రామకుప్పం, ఆగస్టు 26: మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం ప్రజలు కావళ్ల పండుగను కోలాహలంగా నిర్వహించుకున్నారు. 11 రోజుల పాటూ ఉపవాసదీక్షతో ఉన్న పలువురు కావళ్లు ఎత్తుకున్నారు. పలువురు భక్తులు వీపునకు కొక్కీలు తగిలించుకుని వీపుతేర్లను లాగారు. మరికొందరు దవడలకు పొడవాటి శూలాలను గుచ్చుకున్నారు. వారంతా సాయంత్రం నుంచి రామకుప్పం శివార్లలోని వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చేరుకుని, అక్కడ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాను పంపిణీ చేశారు.

పాలేటమ్మ రెండో జాతరకు శ్రీకారం


ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

సోమల, ఆగస్టు 26: సోమల మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి రెండో జాతర నిర్వహణకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఆదివారం రాత్రి గొల్లపల్లెలో అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు. పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు ఇంటింటా మంగళ హారతులు పట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకొని వచ్చి పూజలు జరిపారు. వారంరోజుల పాటు అమ్మవారి ఉత్సవమూర్తిని పలు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించ నున్నారు. కాగా గత 20 ఏళ్లగా అమ్మవారి జాతరను ఏటా రెండు పర్యాయాలు నిర్వహిం చడం ఆనవాయితీగా మారింది. రెండు సామాజిక వర్గాల మధ్య జాతర నిర్వహణలో విభేదాలు రావడం, అమ్మవారి ఉత్సవమూర్తిని కోర్టుకు తరలించారు. కోర్టు తీర్పుతో రెండు పర్యాయాలు జాతరను నిర్వహించుకుంటున్నారు. ఓ సామాజిక వర్గం ఆగస్టు 13న జాతరను నిర్వహించగా మరో సామాజిక వర్గం సెప్టెంబరు 2న జాతర చేసుకోనుంది.

దేవదాయశాఖ భూములకు భద్రత

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 26: స్థానిక ఓవర్ బ్రిడ్జి పక్కనున్న దేవదాయశాఖ పరిధిలోని జీవకారుణ్య అన్నదాన సమాజ భూములు అన్యాక్రాంతం కాకుండా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చర్యలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం భూములను పరిశీలించిన ఆయన అందులో ముళ్ల కంపలను తొలగించి, శుభ్రం చేయించాలని ఈవో తిమ్మారెడ్డిని ఆదేశించారు. కొందరు అక్కడే పందులను పెంచుతూ మాంస విక్రయాలు చేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అందులోని పురాతన శివాలయం ఆలనాపాలన లేకుండా ఉండడం ఎమ్మెల్యే గమనించారు. పందుల పెంపకందారులను అక్కడి నుంచి తరలించాలని, శివాలయాన్ని పునరుద్ధరించి, నిత్య కైంకర్యాలు నిర్వహించాలని దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈవో తిమ్మారెడ్డి సోమవారం ముళ్ల కంపలను తొలగించి, హద్దులు ఏర్పాటు చేయించారు. పందుల పెంపకందారులను తరలించారు. శివాలయంలో పూజల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. ఎమ్మెల్యే చొరవపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మెలగండి

కుప్పం, ఆగస్టు 26: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారులు మెలగాలని కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు సూచించారు. ఆంధ్రజ్యోతిలో 'కుప్పంలో ట్రాఫిక్ 'లోడింగ్' అన్న శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి ఆయన స్పందించారు. పట్టణంలోని వ్యాపారులను స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. లోడింగ్, అన్ లోడింగ్‌లు రాత్రివేళ నిర్వహించుకోవాలని ఆదేశించారు. వ్యాపారులు మాట్లాడుతూ కుప్పంలోని పలు హమాలీల కుటుంబాలు, వ్యాపార కుటుంబాలు, వాహన యజమానులు రవాణా సరుకుమీదే ఆధారపడుతున్నాయని చెప్పారు. రాత్రి వేళ సరుకుల లోడింగ్ కానీ, అన్‌లోడింగ్ కానీ చేయాలంటే తమకు చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. వ్యాపారాలు తగ్గిపోవడమే కాక, హమాలీలు ఆ సమయంలో పనికి రావడానికి వెనుకాడుతారని, వారి కుటుంబాలు కూడా ఇబ్బందులు పడుతాయని విన్నవించారు. దీనిపై స్పందించిన సీఐ జీటీ.నాయుడు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధానమైన నేతాజీ రోడ్డులో మాత్రం పగటి పూట లోడింగ్, అన్‌లోడింగ్‌లు చేయరాదని పేర్కొన్నారు. మిగిలిన ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, స్థానికులకు ఇబ్బంది కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అయితే స్థానికుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని ఆయన స్పష్టంచేశారు.

800 లీటర్ల సారా ఊట ధ్వంసం



కుప్పం రూరల్, ఆగస్టు 26: కుప్పం మండలంలోని మోట్ల చేనులోని అటవీ ప్రాంతంలో కుప్పం అర్బన్ సీఐ జీటీ.నా యుడు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఆకస్మికంగా దాడులు చేశారు. నిలువ ఉంచిన 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మృతి


మాజీ వైస్ ఛైర్మన్ ఖాదర్‌ఖాన్

పుంగనూరు రూరల్, ఆగస్టు26: పుంగనూరు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఖాదర్‌ఖాన్(92) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికవుతూ వచ్చారు. పట్టణంలోని ప్రముఖులు ఆయనకు నివాళులర్పించారు.

ఒకరిపై దాడి..పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఆగస్టు26: పట్టణంలోని కొత్తపేటకు చెందిన సురేశ్ ఆదివారం రాత్రి రోడ్డుపై తన భార్య రాణితో కలిసి ఉండగా అదే ప్రాంతానికి చెందిన కిషోర్, బాలాజీలు దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ తీగలు తగిలి మేస్త్రీకి గాయాలు


శంకరాయగుంటలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 26 : 33కేవీ విద్యుత్ లైన్ తగిలి మేస్త్రీకి గాయాలైన ఘటన నగరంలో సోమవారం చోటు చేసుకుంది. శంకరాయ గుంటకు చెందిన ఇక్బాల్ ఇంటి నిర్మాణ చేపట్టాడు. మేస్త్రీ రమేష్ మొదటి అంతస్తులో అడ్డంగా ఉన్న ఇనుప పైపును కిందకు తరలిస్తున్న సమయంలో పైనున్న 33 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నగరంలో చాలాచోట్ల విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళుతుండడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి


పలమనేరులో నిర్వహించిన ఊరేగింపు

పలమనేరు, ఆగస్టు 26 : పలమనేరులో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని విష్ణుపురిలో వెలసిన నిర్వాణ నారాయణస్వామి వారికి ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్, ఆలయ అర్చకులు, భక్తులు వెన్న అలంకరణ చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పలమనేరులోని త్రైత సిద్ధాంతం -దివ్యజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బసవన్న కట్ట ఆలయం వద్ద నుంచి శ్రీకృష్ణభగవానుడి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు కాషాయ జెండాలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జ్ఞానవేదిక పలమనేరు కమిటీ అధ్యక్షులు భాస్కర్, సభ్యులు వింధ్య, జీవరత్న, సరళ, హేమంత్, రెడ్డెమ్మ, బాలాజి, అశోక్‌బాబు, కృష్ణ, వాణిశ్రీ, రేఖ, కళ్యాణి, తది తరులు పాల్గొన్నారు. ● పలమనేరులోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత జాయింట్ కలెక్టర్ చంద్రమౌళి, పలమనేరుకు చెందిన గణేష్ కుటుంబసభ్యులు సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలోని కోట ఆంజ నేయ స్వామి పూజల కోసం వెండి యజ్ఞోపవీతాన్ని ఆలయ అర్చ కులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం పిళ్లై తదితరులు చంద్రమౌళి, గణేష్‌లను సత్కరించారు.




వెన్న అలంకరణలో విష్ణుపురిలో నిర్వాణ నారాయణస్వామి, ఆంజనేయుడికి వెండి యజ్ఞోపవీతం అందజేస్తున్న విశ్రాంత జేసీ


కుప్పంలో విశేష అలంకరణలో శ్రీకృష్ణ స్వామి

రామకుప్పం: మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కొంగనపల్లె, విజలాపురం వేణుగోపాలస్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ప్రజలు తమ ఇళ్లలో శ్రీకృష్ణుడి ప్రతిమలు ఏర్పాటు చేసి పూజలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు వేయించి మురిసిపోయారు.

కుప్పం: పట్టణంలోని పలు వైష్ణవాలయాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పైబాటలో వెలసిన కృష్ణార్జున ఆలయంలో ఆలయ ధర్మ కర్త బీఎం.దయానిధి ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. భక్తులు పెద్దయెత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల తరఫున తీర్థప్రసా దాలు అందజేశారు. ఇంకా పలు వైష్ణవాలయాలలో భక్తిశ్రద్ధల మధ్య పూజలు జరిగాయి.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : చల్లా బాబు


చల్లా బాబును సన్మానిస్తున్న తలారివారిపల్లి గ్రామస్తులు

రొంపిచెర్ల, ఆగస్టు 26: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని పుంగ నూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు తెలిపారు. రొంపిచెర్లలోని చల్లా ఆయన నివాసంలో సోమవారం నియోజకవర్గం పరిధిలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, ఆలయాల అభి వృద్ధి తదితర మౌలిక వసతులపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అవసరం మేరకు సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడతామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పులిచెర్ల మండలం తలారివారిపల్లిలో ఆలయ అభివృద్ధి కోసం గ్రామస్తులు అందజేసిన వినతిపై దేవదాయశాఖ అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు ఉయ్యాల రమణ, నాయకులు ఓబులేశ్వర్‌రెడ్డి, రవినాయుడు, మురళీధర్‌నాయుడు, హరిబాబు, నాగరాజ, రామ్మూర్తి, కరుణాకర్‌నాయుడు, నాగార్జుననాయుడు, గౌస్‌పీర్‌ఖాన్, అనీల్‌కుమార్, అబ్బాస్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: అభివృద్ధే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తెల్లనీళ్లపల్లెలో మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఇంట్లో టీడీపీ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమా వేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు విజన్‌తో అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాష్, ఉయ్యాల రమణ, ఓబుల్‌రెడ్డి, కుమార్, గిరిరాజు, శేషాద్రి నాయుడు, సుబ్రహ్మణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బలిజలను గుర్తించండి


గంగమ్మ ఆలయంలో సమావేశమైన టీడీపీ బలిజ కులస్తులు

కుప్పం, ఆగస్టు 26: తెలుగుదేశం పార్టీలో తాము చేసిన త్యాగాలను గుర్తించి సముచిత స్థానం కల్పించాలని బలిజ కులస్తులు డిమాండ్ చేశారు. కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగ మాంబ ఆలయం ఆవరణలో సోమవారం టీడీపీలోని బలిజ కుల నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకోసం కష్టపడి, కేసులు పెట్టించుకుని జైళ్లపాలు అయిన నాయకులు ఉన్నారన్నారు. అధికారంలోకి వచ్చాక పార్టీలో తమకు తగిన గుర్తింపు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో తమకు సముచిత స్థానం ఇవ్వాలని త్వరలోనే ముఖ్య మంత్రి చంద్రబాబును కలిసి విన్నవించనున్నట్లు పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్ర బాబుతో మాట్లాడి బలిజ కులస్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వినాయక చవితి వేడుకలకు ప్రతిమలు సిద్ధం



సోమల, ఆగస్టు 26: వినాయక చవితిని పురస్కరిం చుకొని వాడవాడల్లో ప్రతిమల ప్రతి ష్ఠకు యువత శ్రీకారం చుడుతున్నారు. మరో వైపు పట్టణాల్లోనే కాకుండా పల్లె ప్రాంతాల్లోనూ ప్రతిమల తయారీ ఊపందుకుంది. సోమల పంచాయతీ అడుసు పల్లెకు చెందిన కుమ్మరి కృష్ణయ్య కుటుంబ సభ్యులు పదేళ్లగా ప్రతిమలను తయారీ చేసి విక్రయి స్తున్నారు. సోమల వారపు సంత వద్ద రూ.4వేలు నుంచి రూ.35 వేలు విలువ చేసే విగ్ర హాలను రూపొంది స్తున్నారు. వినాయకుడు, శివపార్వతులు, నంది విగ్రహంపై గణేషుడు తదితర రూపాల్లో విగ్రహాలను విక్రయిస్తున్నారు. 5 నుంచి 10 అడుగుల విగ్రహాలను సుం దరంగా తయారు చేస్తున్నారు. సెప్టెంబరు 6న వినాయక చవితి కోసం యువత అప్పుడే విగ్రహాలకు అడ్వాన్సులు చెల్లించి పండుగ సంబరాల్లోకి వెళ్లిపోయారు.

పెద్దఉప్పరపల్లెలో కృష్ణాష్టమి వేడుకలు



సోమల, ఆగస్టు 26: మండలంలోని పెద్దఉప్పరపల్లెలో గోకులాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో అర్చకులు హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణంలో గోపూజలు జరిపారు. యాదవ సంఘ సభ్యులచే చిన్నారులకు రాధా, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపారు. అనంతరం పురవీధుల్లో ఉత్సవమూర్తులను బాణ సంచా వేడుకలతో ఊరేగించారు. అన్నదానం చేశారు.

సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలి



సోమల, ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదులో యువత చురుగ్గా పాల్గొనాలని ఆపార్టీ పుంగనూరు నియోజక వర్గం కన్వీనర్ గన్నా మదన్‌మోహన్‌బాబు పిలుపునిచ్చారు. సోమ వారం స్థానిక కార్యాలయంలో సోమల మండల నాయకులతో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు దేశవ్యాప్తంగా జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధిని వివరించి పార్టీలో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు శీలం రామ్మూర్తి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, నాయకులు సురేంద్ర గుప్తా, సుబ్రహ్మణ్యం, దేవేంద్ర పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, ఆగస్టు 26: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు అనేక అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రశ్నించిన ప్రజలపైనా, టీడీపీ నాయకులు, కార్యకర్తలపైనా దాడులు, దౌర్జన్యాలు చేశారని, అక్రమ కేసులు బనాయించి జైళ్లపాలు చేశారని ధ్వజమెత్తారు. ఆయా అక్రమాలు, అన్యాయాలపై విచారణలు జరుగుతున్నాయని, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రజ సుపరిపాలనను ఆశిస్తున్నారన్నారు. వారి ఆశలకు భంగం కలిగించేలా అవినీతి, అక్రమాలు జరిగాయని తెలిస్తే టీడీపీవారినైనా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్సీ స్పష్టంచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి విజన్ డాక్యుమెంట్ ఇప్పటికే తయారయిందన్నారు. చంద్రబాబు ఆమోదం పొందిన తర్వాత కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. కుప్పం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా చేయడానికి కూడా ప్రణాళికలు సిద్ధమయ్యాయన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ మున్సిపాలిటీగా తయారు చేస్తామన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, చెక్కునత్తం మణి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కృష్ణ మందిరాలు




ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు, స్వామివారిని దర్శించుకుంటున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు26: పట్టణ సమీపంలో వెలసిన శ్రీకృష్ణ ఆలయం, గూడూరుపల్లె వద్ద వెలసిన శ్రీకృష్ణ ఆలయాలు కృష్ణ భక్తులతో నిండి పోయాయి. సోమవారం కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయానికి ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేసి హోమాలు, పూజలు నిర్వహించారు. యాదవ కులస్తులు ఉదయం నుంచి భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఏర్పాటు చేసి మంగళవాయిద్యాలు, పిల్లనగ్రోవి, చెక్కభజనల మధ్య ఆలయం నుంచి గోకుల్ సర్కిల్ వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యేడాది కృష్ణాష్టమికి టీడీపీ నాయకులు, కార్యకర్తలను రాన్వికుండా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు పోలీసులతో అడుకున్నారని, ఎన్డీయే ప్రభుత్వ పాలనలో ఆలయాలకు అన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలకు రావచ్చు అన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మాధవరెడ్డి, శ్రీకాంత్, సీవీరెడ్డి, గువ్వల రమేశ్‌రెడ్డి, ఉయ్యాల రమణ, శమిపతి, వెంకటముని, ఎల్వీరమణ, నవీన్‌కుమార్, రమణ, గిరిరాజు, గంగులప్ప, మణి, గంగాధర్, గంగరాజు, జనసేన నాయకులు విరూపాక్షి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోపాలుడికి అభిషేకాలు



చౌడేపల్లె, ఆగస్టు26: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక బజారు వీధిలో, ఎస్ ఆగ్రహారంలో వెలసిన రుక్మిణి, సత్య భామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంక రించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే షిరిడిసాయి విజయవాణి స్కూల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గొల్లభామల వేషధారణతో సందడిచేశారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు




చిత్తూరు హైరోడ్డు కృష్ణ మందిరంలో భక్తుల సందడి - కార్వేటినగరంలో రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 26: జిల్లావ్యాప్తంగా సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. చిత్తూరు చర్చివీధి రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ట్రస్టీ బుల్లెట్ సురేష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మూలవర్లకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. విశేష అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. హైరోడ్డు గోకులకృష్ణ మందిరంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గిరింపేట వేణుగోపాల స్వామి, సంతపేట రంగనాథ స్వామి, కట్టమంచి మహాలక్ష్మీ వెంకటేశ్వర, దుర్గానగర్ కాలనీ సర్వసిద్ధి వినాయక, న్యూ బాలాజీ కాలనీ పంచముఖ వినాయక ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. మురుగానిపల్లె శ్రీకృష్ణ మందిరంలో ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కాజూరు బాలాజీ పూజలు చేయించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో గోకులాష్టమి

వెదురుకుప్పం, ఆగస్టు 26: కార్వేటినగరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం గోకులాష్టమి వేడుకలను ఆలయాధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, పూజాది కార్యక్రమాలు చేశారు. శుద్ధి, తోమాల, కొలువు, అర్చన కార్యక్రమాలు జరిపించారు. భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం పది నుంచి 11 గంటల వరకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం పూజా కార్యక్రమాల తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రికి శుద్ధి, ఏకాంత సేవ చేయించారు.

వెదురుకుప్పం : కార్వేటినగరం, వెదురుకుప్పం మండలాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చవటగుంట ద్రౌపదీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, అన్నదానం చేశారు. కార్వేటినగరంలోని సరస్వతి శిశు మందిర్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. పిల్లలకు గోపిక, కృష్ణుల వేషధారణలు వేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

విజయపురం : మండలంలోని పాతార్కాడు, తెల్లగుంట, జగన్నాథపురంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పిల్లలకు శ్రీకృష్ణుడి వేషం వేయించి, ఊరేగించారు. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించారు.

నగరి : మున్సిపాలిటీ, మండల పరిధిలోని కృష్ణాలయాలు సోమవారం భక్తులతో కళకళలాడాయి. మహిళలు పిండి వంటలతో శ్రీకృష్ణుడికి మొక్కులు తీర్చుకున్నారు. తడుకుపేటలో సత్యసాయి భజన మండలి వారు వేడుకలు నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు మధుసూదనరావు గోపూజ, అష్టోత్తర పూజలు, భజనలు చేశారు. 500 మందికి అన్నదానం చేశారు. మొక్కలు పంపిణీ చేశారు.

పాలసముద్రం : మండలంలోని రాచపాళ్యం, వెంగళరాజకుప్పం, వనదుర్గాపురం, కృష్ణజిమ్మాపురం, ఆముదాల, బాలకృష్ణాపురం, తిరుమలరాజుపురం, నరసింహాపురం, కోదండరామాపురం గ్రామాల్లోని శ్రీకృష్ణభజన మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగించారు. రాచపాళ్యం వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం : మండల కేంద్రంలోని రాజావీధిలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక బంగారుపాళ్యం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పూతలపట్టు : మండలంలోని జెట్టిపల్లి, పోటుకనుమ గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అన్నప్రసాదాలు వితరణ చేశారు.

గుడిపాల : మండలంలోని గుడిపాల అరుంధతివాడ, బట్టువాళ్లూరు, బొమ్మసముద్రం, చెరువుముందరవూరు, ముట్టుకూరుపల్లి, 197 రామాపురం గ్రామాల్లో చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. బొమ్మసముద్రం, ముట్టుకూరుపల్లి గ్రామాల్లో అన్నదానం చేశారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.



విజయపురంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



మొక్కలు పంపిణీ చేస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు



వేణుగోపాలస్వామి ఆలయంలో స్నపన తిరుమంజనం



మురుగానిపల్లె ఆలయంలో చెన్న కేశవులునాయుడు, దొరబాబు

విద్యుత్ తీగలు తగిలి మేస్త్రీకి గాయాలు



శంకరాయగుంటలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 26 : 33కేవీ విద్యుత్ లైన్ తగిలి మేస్త్రీకి గాయాలైన ఘటన నగరంలో సోమవారం చోటు చేసుకుంది. శంకరాయగుంటకు చెందిన ఇక్బాల్ ఇంటి నిర్మాణ చేపట్టాడు. మేస్త్రీ రమేష్ మొదటి అంతస్తులో అడ్డంగా ఉన్న ఇనుప పైపును కిందకు తరలిస్తున్న సమయంలో పైనున్న 33 కేవీ విద్యుత్ లైన్‌కు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నగరంలో చాలాచోట్ల విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళుతుండడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామి అమ్మవార్లు

వెదురుకుప్పం, ఆగస్టు 26: కృత్తికను పురస్కరించుకుని కార్వేటినగరంలోని సుబ్రహ్మణ్యం స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శన వసతి కల్పించారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సాయిబాబాకు వార్షికోత్సవ పూజలు



వెదురుకుప్పం, ఆగస్టు 26: కార్వేటినగరం సాయిబాబా ఆలయంలో సోమవారం 16వ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేశారు. పురోహితులతో శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు ఇచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాదం వితరణ చేశారు.

నేడు కార్వేటినగరం మండల సమావేశం

వెదురుకుప్పం, ఆగస్టు 26: వెలుగు సమైక్య కార్యాలయంలో మంగళవారం కార్వేటినగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మీపతి సోమవారం తెలిపారు. మండల స్థాయి అధికారులంతా ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

రికార్డు స్థాయిలో బీజేపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న సౌందర్యపాండ్యన్

నగరి, ఆగస్టు 26: పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. సోమవారం నగరి పార్టీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి సౌందర్యపాండ్యన్ మాట్లాడుతూ ప్రతి బూత్‌లోనూ 200 మందికి సభ్యత్వం కల్పించాలని సూచించారు. నాయకులు పొన్నప్పన్, మణివణ్ణన్, రాజదొరై, సౌందర్యపాండ్యన్, రాము, కుమార్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీటుబెల్టు, హెల్మెట్ తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామ్మోహన్

గుడిపాల, ఆగస్టు 26: బైక్‌లో వెళ్లే వారు హెల్మెట్, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టు తప్పకుండా ధరించాలని ఎస్ఐ రామ్మోహన్ కోరారు. చిత్తూరు - వేలూరు, బెంగళూరు - చెన్నై జాతీయ రహదారుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోందని, ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదమని పేర్కొన్నారు. ఎంసీఆర్ క్రాస్ వద్ద ఆయన సోమవారం వాహనాల తనిఖీ చేపట్టి మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న, హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు.

ఘనంగా కాలభైరవాష్టమి పూజలు



పూజ సామగ్రి తెస్తున్న ట్రస్టు నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 26: స్థానిక అగస్తీశ్వరాలయంలో సోమవారం కాలభైరవాష్టమి పూజలు నిర్వహించారు. గో, అశ్వ, శునకాలకు పూజలు చేసి, ఆలయ ప్రదక్షిణ చేశారు. అర్చకులు కాలభైరవ స్వామికి సహస్రనామార్చన, మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాలభైరవ ట్రస్టు అధ్యక్షుడు వెంకటేశన్, ఉభయదారులు హేమలత పాల్గొన్నారు.

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కాలభైరవాష్టమి పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామికి పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విభూదితో అభిషేకాలు చేశారు. అభిషేకానంతరం విభూది అలంకరణ చేశారు. భక్తులు తీసుకొచ్చిన వడమాలలతో స్వామిని అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పార్టీకి సభ్యత్వం కీలకం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 26: బీజేపీ సభ్యత్వ నమోదుపై మండలాధ్యక్షుడు సురేష్‌బాబు అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు సోమవారం సమావేశమయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పార్టీకి సభ్యత్వం కీలకమన్నారు. సెప్టెంబరు ఒకటి నుంచి 88000 02024 నంబరుకు మిస్డ్ కాల్ ద్వారా సభ్యత్వం వేగవంతం చేయాలన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

గుడిపాల, ఆగస్టు 26: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం ఈ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు.

రోడ్డుపై మురుగునీరు తొలగించాలని ధర్నా





రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్‌లో) గాయపడిన వృద్ధుడు, మహిళ

బంగారుపాళ్యం, ఆగస్టు 26: మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆండారెడ్డిపల్లి గ్రామస్తులు, ద్విచక్ర వాహనదారులు సోమవారం రోడ్డుపై ధర్నా చేశారు. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లి వద్ద మురుగునీరు కొంతకాలంగా రోడ్డుపై ప్రవహిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. సోమవారం ఆ ప్రాంతంలో నలుగురు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడి తీవ్రంగా గాయాలపాలయ్యారని తెలిపారు. విద్యార్థులు కూడా రోజు పడిలేచి వెళ్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు కోరుతున్నారు.

దేవదాయశాఖ భూములకు భద్రత



శుభ్రపరిచిన అన్నదాన సమాజ భూములు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 26: స్థానిక ఓవర్ బ్రిడ్జి పక్కనున్న దేవదాయశాఖ పరిధిలోని జీవకారుణ్య అన్నదాన సమాజ భూములు అన్యాక్రాంతం కాకుండా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చర్యలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం భూములను పరిశీలించిన ఆయన అందులో ముళ్ల కంపలను తొలగించి, శుభ్రం చేయించాలని ఈవో తిమ్మారెడ్డిని ఆదేశించారు. కొందరు అక్కడే పందులను పెంచుతూ మాంస విక్రయాలు చేస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అందులోని పురాతన శివాలయం ఆలనాపాలన లేకుండా ఉండడం ఎమ్మెల్యే గమనించారు. పందుల పెంపకందారులను అక్కడి నుంచి తరలించాలని, శివాలయాన్ని పునరుద్ధరించి, నిత్య కైంకర్యాలు నిర్వహించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈవో తిమ్మారెడ్డి సోమవారం ముళ్ల కంపలను తొలగించి, హద్దులు ఏర్పాటు చేయించారు. పందుల పెంపకందారులను తరలించారు. శివాలయంలో పూజల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే చొరవపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ద్రావిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీకి పురస్కారం



గుడుపల్లె, ఆగస్టు 26: ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొర స్వామి నాగభూషణం పురస్కారాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన పాతూరి ఫౌండేషన్ సమావేశంలో అధ్యక్షులు కేసీ కల్కూరా చేతుల మీదుగా ఆయన సత్కారం పొంది, నాగభూషణం పురస్కారాన్ని స్వీకరించారు.

పాలేటమ్మ రెండో జాతరకు శ్రీకారం



సోమల, ఆగస్టు 26: సోమల మండలంలోని నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మవారి రెండో జాతర నిర్వహణకు నిర్వాహకులు శ్రీకారం చుట్టారు. ఆదివారం రాత్రి గొల్లపల్లెలో అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు. పోతురాజు విన్యాసాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు ఇంటింటా మంగళ హారతులు పట్టి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకొని వచ్చి పూజలు జరిపారు. వారంరోజుల పాటు అమ్మవారి ఉత్సవమూర్తిని పలు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించ నున్నారు. కాగా గత 20 ఏళ్లుగా అమ్మవారి జాతరను ఏటా రెండు పర్యాయాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. రెండు సామాజిక వర్గాల మధ్య జాతర నిర్వహణలో విభేదాలు రావడం, అమ్మవారి ఉత్సవమూర్తిని కోర్టుకు తరలించారు. కోర్టు తీర్పుతో రెండు పర్యాయాలు జాతరను నిర్వహించుకుంటున్నారు. ఓ సామాజిక వర్గం అగస్టు 13న జాతరను నిర్వహించగా మరో సామాజిక వర్గం సెప్టెంబరు 2న జాతర చేసుకోనుంది.



పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలోని కోదండరామస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి సందర్భంగా రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు